క్లుప్తంగా

కిష్టారం సమస్యలపై సింగరేణి సీఎండీకి వినతి



సీఎండీ బలరాంకు వినతిపత్రం అందజేస్తున్న కిష్టారం ప్రజలు, ప్రజాప్రతినిధులు

సత్తుపల్లిరూరల్: సింగరేణి ప్రభావంతో కిష్టారం గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై బుధవారం కొత్తగూడెం సింగరేణి కార్యాలయంలో సీఎండీ బలరాంకు కిష్టారం గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు వినతిపత్రం అందించారు. కిష్టారం గ్రామంలో ప్రధానంగా సైలో బంకర్ నుంచి వస్తున్న దుమ్ముధూళి, గ్రామ చివరన కూలిపోతున్న హరిజనవాడ, పాఠశాలల్లో టాయిలెట్స్, సోలార్ పెన్సింగ్, గ్రామంలోని రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ తదితర విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు నాగేశ్వరరావు, ఈశ్వర్, ఉపసర్పంచ్ ధనుంజయ్, కాంగ్రెస్ నాయకులు యోహాన్, లక్ష్మారెడ్డి ఉన్నారు.

నియామకం



వెంకటేశ్వరరావు

సత్తుపల్లి: అఖిలభారత షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ జాతుల హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సత్తుపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన శ్రీరామ వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు దాసరి నాగరాజుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నిరంతరం ప్రజల్లో చైతన్యం రావడానికి ఎస్సీ, ఎస్టీల పరిరక్షణ కోసం కృషి చేస్తానని శ్రీరామ వెంకటేశ్వరరావు తెలిపారు.

పైపులైన్‌కు మరమ్మతులు



పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

వైరారూరల్: మండలంలోని కేజీ సిరిపురం గ్రామ ప్రధాన సెంటర్ ఉన్న వాటర్ ట్యాంక్ సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలి నీరు మొత్తం నిలిచి మురుగుగా మారుతుండడంతో.. ఈ నెల 16వ తేదీన 'సాక్షి'దినపత్రికలో 'పగిలిన పైపు లైను' అనే శీర్షికను ప్రచురించింది. దాంతో స్పందించిన సంబంధిత శాఖ అధికారులు బుధవారం పైపులైన్ మరమ్మతు పనులు చేపట్టారు.

రద్దు చేయాలి

సత్తుపల్లి: తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ పాఠశాలల పరీక్షలు నిర్వహించడానికి నిర్ణయించిన షెడ్యూల్‌కంటే ముందే కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పరీక్షలు ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నాయని, ఆయా పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బెజవాడ సాయిశేషు డిమాండ్ చేశారు. బుధవారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు కాలయాపన చేస్తే విద్యార్థులు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఫైన్ విధించి చేతులు దులుపుకోకుండా కఠినంగా వ్యవహరించాలని కోరారు. ప్రభుత్వం ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం కాకుండా ఏకంగా మూడు సార్లు పరీక్షలు వాయిదా వేయటం గందరగోళానికి గురి చేసిందని విమర్శించారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు యశ్వంత్, సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, నేహారెడ్డి, అశోక్, మహేష్, కల్యాణ్, పావని, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించాలని గ్రామస్తుల ఆందోళన



రోడ్డుపై ఆందోళన చేస్తున్న కల్లురుగూడెం ఎస్సీ కాలనీ వాసులు

వేంసూరు: తాగునీరు అందించాలని కల్లూరుగూడెం ఎస్సీకాలనీ గ్రామస్తులు బుధవారం రోడ్డుపై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పదిహేను రోజులుగా నీరులేక ఇబ్బందులు పడుతున్నామని.. సమస్యను ఉన్నతాధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన బండి శ్రీనివాసరెడ్డికి సమస్యను తెలుపడంతో వ్యవసాయ మోటార్‌నుంచి పైప్‌లు ఏర్పాటు చేసి బుధవారం నీరు సరఫరా చేయడం జరిగిందన్నారు.

జై శ్రీరామ్..

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన సీతారాముల కల్యాణ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం సీతారాముల గ్రామోత్సవం నిర్వహించగా.. మహిళలు కోలాట నృత్యాలు ప్రదర్శించారు. స్వామివారి దర్శనం అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయాల వద్ద చలువ పందిళ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. శ్రీరామ నామస్మరణతో రామాలయాలు మార్మోగాయి.

– సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిటౌన్: శ్రీకోదండ రామాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రాగమయి



మధిర: సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



వైరా: సాయిబాబా దేవాలయంలో అన్నదానం చేస్తున్న భక్తులు



తల్లాడ: రామానుజవరంలో సీతారాముల కల్యాణానికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఆయల కమిటీ సభ్యులు



ఏన్కూరు: కోదండ రామాలయంలో..



ముదిగొండ: తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు



కొణిజర్ల: పాతబజార్ అభయాంజనేయస్వామి దేవాలయంలో..



కల్లూరు: విశ్వబ్రాహ్మణ కాలనీలో..



మధిర(చింతకాని): మత్కేపల్లి గ్రామంలో..



పెనుబల్లి: కోదండరామాలయంలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు



తల్లాడ: సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కొణిజర్ల: సీతారాములకు తలంబ్రాలు పోస్తున్న భక్తులు



వైరారూరల్: శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో..



ఎర్రుపాలెం: మీనవోలులో సీతారాముల కల్యాణం చేస్తున్న అర్చకులు



కల్లూరురూరల్: గోకవరంలో..



సత్తుపల్లిరూరల్: బుగ్గపాడు అడవిలోని రామలక్ష్మణుల ఆలయంలో..



వేంసూరు: చౌడవరంలో ..



కారేపల్లి: మాణిక్యారం గుడితండా శ్రీసీతారామ దేవాలయంలో..

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



ఎమ్మెల్యే రాగమయిని సన్మానిస్తున్న పాస్టర్ల కమిటీ సభ్యులు

వేంసూరు: పాస్టర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. వేంసూరు మండల పాస్టర్ల నూతన కమిటీ అధ్యక్షుడు నక్కా సుందర్‌రావు ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాస్టర్లకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని, కలిసి కట్టుగా ఉంటేనే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. మండలంలో నూతనంగా ఏర్పాటైన మండల పాస్టర్ల కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో వేంసూరు మండల పాస్టర్ల కమిటీ అధ్యక్షుడు పాస్టర్ నక్కా సుందర్‌రావు, ఉపాధ్యక్షులు పాస్టర్ బోయ ప్రసాద్, సెక్రటరీ పాస్టర్ సురేష్, కోశాధికారి పాస్టర్ జోసెఫ్, సభ్యులు పాస్టర్ లాజర్, పాస్టర్ జాన్సన్, పాస్టర్ మోషే, పాస్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'నకిలీ'తో నష్టం

రైతులను ముంచిన నకిలీ వరి విత్తనాలు

- బోర్లు, బావుల కింద సాగు
- మూడు దఫాలుగా ఈనుతున్న వరి
- ఎకరానికి రూ.25 వేల పెట్టుబడి
- పరిహారం అందించాలని డిమాండ్



వరిపైరును పరిశీలిస్తున్న రైతులు (ఫైల్)

తల్లాడ: రబీ సీజన్లో సాగు చేసిన వరి రైతులకు నకిలీ విత్తనాల బెడద ఆందోళన కలిగిస్తోంది. నకిలీ విత్తనాల వల్ల వరి ఈనడంలో ముందు వెనుక అవుతుంది. ఒకే పొలంలో వరి వేయగా కొంత ముందుగా ఈని, మరికొంత వారం వ్యవధిలో ఈనుతుంది. మరికొంత వరి 15 రోజుల వ్యవధిలో ఈనడం ఇలా మూడు దఫాలుగా ఈనడం వల్ల వడ్ల దిగుబడిపై ప్రభావం పడుతుంది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి శ్రమించిన రైతులకు తీవ్ర నిరాశను కల్గిస్తోంది.

బోర్లు, బావుల కింద సాగు..

నాగార్జున్ సాగర్ కాల్వల ద్వారా నీరు సరఫరా లేక పోవడంతో బావులు, బోర్ల కింద వరి పంట సాగు చేశారు. వెంగన్నపేట, తెలగవరం, బిల్లుపాడు, అంజనాపురం గ్రామాలకు చెందిన పలువురు రైతులు ఎన్టీఆర్ జిల్లా తిరువూరులోని విత్తన దుకాణం నుంచి హెచ్ఎంటీ సోనా వరి విత్తనాలు కొనుగోలు చేసి సుమారు 60 ఎకరాల్లో వ్యవసాయాధికారుల సూచనల మేరకు వరిపైరు సాగు చేశారు. రెండు నెలలు ఏపుగా పెరిగిన వరి తీరా పొట్ట దశకు వచ్చేవరకు మూడు దఫాలుగా ఈనుతుంది. దీంతో ఎకరానికి మూడునుంచి నాలుగు బస్తాలు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి లేదు.

ఎకరానికి రూ.25 వేల పెట్టుబడి

వరిపైరుకు దుక్కి దున్నిన దగ్గర నుంచి విత్తనాలు, ఎరువులు, నాటు కూలీ, కలుపు తీయడం వంటి ఖర్చులతో రూ.25 వేలు పెట్టుబడి పెట్టినట్లు రైతులు తెలిపారు. కౌలు రైతులకు మరో రూ.30 వేలు వరకు భారం పడుతుంది. అసలు రైతుల కంటే కౌలు రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు.

విత్తన లోపమే కారణం..



నేను 10 ఎకరాల్లో వరిసాగు చేశారు. తిరువూరు నుంచి తెచ్చిన విత్తన లోపం కారణంగానే వరిలో మూడు దఫాలుగా ఈనడం జరిగింది. ఇలా ఈనడం వల్ల పంట కోయడానికి అవకాశం లేకుండా పోతుంది. ముందుగా ఈనిన వరి అర్రు వంచి వడ్లు రాలిపోతున్నాయి.

– గొల్లమందల నరేష్, కౌలు రైతు, తెలగవరం

ప్రభుత్వమే ఆదుకోవాలి..



విత్తన లోపంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. విత్తన లోపంలో వచ్చిన మార్పులపై విచారణ జరిపించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఎకరానికి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులకు రబీ సీజన్ నష్టపరిచింది.

– ఎక్కిరాల వెంకటేశ్వర్లు, రైతు వెంగన్నపేట

సీఎం క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న కూరపాటి సునీల్‌మాదిగ

మధిర: మందా కృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగ జాతికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం మధిరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయంగా మాదిగల అస్తిత్వం లేకుండా చేయాలని కుట్రపూరితంగానే మాదిగలకు రాజకీయ ప్రాతినిధ్యం ఇవ్వటం లేదన్నారు. మాదిగల అండదండలతోనే తాను ఈ స్థాయికి వచ్చానని, తాను పుట్టిన రెడ్డి కులం తనకు సపోర్ట్ చేయలేదని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎందుకిలా వ్యవహరిస్తున్నారన్నారు. మాదిగలకు చిన్నా చితక నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇచ్చి.. అవే పెద్ద పదవులని మాదిగలను కించ పరుస్తున్నారన్నారు. ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోట హనుమంతరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలక నాగరాజు మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఊటుకూరి రత్నాకర్ మాదిగ, ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు కనకపుడి శీను మాదిగ, రాయబారపు దాసు మాదిగ, రాజారత్నం మాదిగ, పార్శపు ఏనోక మాదిగ, ఆశీర్వాదం మాదిగ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రైల్వే రిటైర్డ్ ఉద్యోగి మృతి



ఎర్రుపాలెంలో ప్రభాకర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన రైల్వేశాఖ రిటైర్డ్ ఉద్యోగి దేవరకొండ ప్రభాకర్‌రావు(62) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యుడు బీఆర్ఎస్ నాయకుడు దేవరకొండ రవిని పరామర్శించి సానుభూతి తెలిపి సంతాపం వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పంబి సాంబశివరావు, ఎంపీటీసీ సగ్గుర్తి కిశోర్, నాయకులు గుర్రాల పుల్లారెడ్డి, శ్రీపాలశెట్టి తిరుపతిరావు, తదితరులు ఉన్నారు.

గొంతెండుతోంది..

- కాలనీలలో తాగునీటి కటకట..
- ట్యాంకర్ నీరే దిక్కు
- ఇబ్బంది పడుతున్న సత్తుపల్లి ప్రజలు




అస్తవ్యస్తంగా మిషన్ భగీరథ పైపులైన్, పనిచేయని చేతిపంపు



మున్సిపల్ ట్యాంకర్ కోసం ఎదురు చూస్తున్న డ్రమ్ములు

సత్తుపల్లిటౌన్: తాగునీటి కొరతతో సత్తుపల్లి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నీటి సరఫరా సరిగా లేకపోవడంతో పలు కాలనీలు వేసవి తీవ్రతతో గొంతెండుతున్నాయి. రోజురోజుకి ఎండల తీవ్రతతో నీటి సమస్య తీవ్రమౌతుంది. మరోవైపు ఇళ్లల్లో ఉన్న బావుల్లో నీరు సైతం అడుగంటి పోవడంతో కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. సింగరేణి బొగ్గు తవ్వకాల వల్ల భూగర్భజలాలు ఏటేటా పడిపోతున్నాయని స్థానికులు లబోదిబోమంటున్నారు. పట్టణంలో సుమారు 40వేల జనాభాకు 4.75 ఎంఎల్‌డీ తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇంకా 1.86 ఎంఎల్‌డీ తాగునీరు అవసరం ఉంది. మిషన్ భగీరథతో కొన్ని ప్రాంతాలు, 30 విద్యుత్ బోర్లతో పలు కాలనీలకు సరఫరా చేస్తున్నారు. చేతిపంపులు ఉన్నప్పటికీ పని చేయకపోవటంతో నిరుపయోగంగా మారాయి.

ట్యాంకర్ వస్తేనే తాగునీరు..

పట్టణంలోని జంగాలకాలనీ తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటుంది. వెంగళరావునగర్ కాలనీలో రోజు విడిచి రోజు తాగునీటి సరఫరాతో ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా జవహర్‌నగర్, రాజీవ్‌రోడ్, గాంధీ నగర్‌లలోని పలు ప్రాంతాలు తాగునీటి సరఫరాలో అంతరాయాలతో ఇబ్బందులు పడుతున్నారు.

లీకులు.. గోతులు..

మిషన్ భగీరథ పైపులైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోజురోజుకు పట్టణం విస్తరిస్తున్నటికీ చాలా వీధులకు పైప్‌లైన్ విస్తరణ లేకపోవడంతో ఆయా ప్రాంతాల వాసులు తాగునీటి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో తాగునీటి సరఫరా కోసం మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడటం.. ఈ లీకేజీ గోతులు రోజుల తరబడి పూడ్చకపోవడం వల్ల వాహనదారులకు అవస్థలు తప్పటం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు..



సత్తుపల్లి మున్సిపాలిటీలో తాగు నీటికి బ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వేసవి కాలం దృష్ట్యా తాగు నీటి సమస్యల కోసం మున్సిపాలిటీలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం. ప్రజలు హెల్ప్‌లైన్ కోసం 9704671081కు ఫోన్ చేయాలి. ట్యాంకర్లతో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.రవిబాబు, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

నాలుగురోజుల నుంచి..



మున్సిపల్ ట్యాంకర్ నీళ్ల రాక నాలుగురోజులైంది. తాగు నీటికి చాలా ఇబ్బంది పడుతున్నాం. ట్యాంకర్ వచ్చినప్పుడు డ్రమ్ములు, గిన్నెల్లో నీళ్లు పట్టుకుంటున్నారు. అసలే ఎండా కాలం నీళ్లు లేకుండా ఎట్లా. మిషన్ భగీరథ నీళ్లు రావటం లేదు.

– కె.బేబి, సత్తుపల్లి

బావుల్లో నీళ్లు లేవు..



ఎండాకాలం వస్తే మా కాలనీ బావుల్లో నీళ్లు ఉండవు. ప్యూరీఫైడ్ వాటర్ కొని తెచ్చుకొని తాగుతున్నాం. చేతిపంపు పని చేయటంలేదు. మిషన్‌భగీరథ నీళ్లు మా వీధిలోకి ఎక్కడం లేదు.

– ఎం.వెంకటలక్ష్మి, జంగాలకాలనీ, సత్తుపల్లి